# మద్ది మేడారం జాతరలో భక్తజన సంద్రం

**నాలుగు రోజులుగా తగ్గని సమ్మక్కసారక్క దర్శన మహోత్సవం**

**రెండు లక్షలకు పైగా భక్తుల రాక కోరికలు తీరుతాయన్న గాఢ విశ్వాసం**



తొలిసమయం గూడూరు

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మద్ది మేడారంలో ఆదివాసీల ఆరాధ్య దైవం కొంగు బంగారం సమ్మక్కసారక్క తల్లుల జాతర గత నాలుగు రోజులుగా భక్తజన సంద్రంగా కొనసాగుతోంది. చుట్టుపక్కల గ్రామాలతో పాటు మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం పూజారులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గద్దెలపై తల్లులను ప్రతిష్ఠించారు. శుక్రవారం ఉదయం నుంచి భక్తులు దర్శనానికి బారులు తీరుతూ పూజలు నిర్వహించారు. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతుండటంతో ఇప్పటివరకు దాదాపు రెండు లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మద్ది మేడారం సమ్మక్కసారక్క తల్లులను దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని, పంటలు సమృద్ధిగా పండుతాయని, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని, విద్య, ఉద్యోగ, ధనయోగాలు కలుగుతాయని ప్రాంత ప్రజల గాఢ విశ్వాసం. గూడూరు చివరన, మహబూబాబాద్ ప్రధాన రహదారికి ఆనుకుని జాతర కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గూడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్ పర్యవేక్షణలో ఎస్సైలు గిరిధర్ రెడ్డి, రాజ్ కుమార్, రవికుమార్ లు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. అయితే ఊరి చివర అటవీ ప్రాంతంలోని బొంగు వనంలో వెలిసిన ఈ జాతరకు వచ్చిన భక్తులకు తగిన వసతులు, సౌకర్యాలు లేకపోవడంతో కొంత అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నట్లు భక్తులు వాపోతున్నారు. రాబోయే జాతర నాటికి అయినా చలువ పందిళ్లు, త్రాగునీటి సౌకర్యం, మహిళలుపిల్లల కోసం స్నాన ఘట్టాలు, వాహన పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసి జాతర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని భక్తులు అధికారులను కోరుతున్నారు.

## ఆరు నెలల వయస్సు వరకు ప్రతి నెల నట్టల మందు వేయించాలి

**- పశు వైద్యాధికారి ఆళ్ళ శ్రీకాంత్**




తొలిసమయం కొత్తగూడ

దూడలకు ప్రతినెలకు ఒకసారి నట్టల మందును ఆరు నెలల వయస్సు వచ్చే వరకు క్రమం తప్పకుండా త్రాగించాలి అని పశు వైద్యాధికారి డాక్టర్ ఆళ్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని గుండం గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అరవై తొమ్మిది పశువులను వైద్య పరీక్షలు చేశారు. వాటిలో ముప్పై పశువులకు చికిత్సలు ఇరవై ఐదు దూడలకు నట్టల నివారణ, ఖనిజ లవణాలు, మందులు మరో రెండు పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స. పన్నెండు పశువులకు చూడినిర్ధారణ, ఏడు పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించి అన్ని రకాల మందులు రైతులకు ఉచితంగా ఇవ్వడం జరిగిందని డాక్టర్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ దూడలకు ప్రతినెలకు ఒకసారి నట్టల మందు ఆరు నెలల వయస్సు వచ్చే వరకు త్రాగించాలి దీని వల్ల పశువుల రకరకాల వ్యాధులు, ముఖ్యంగా గర్భకోశ వ్యాధులు తగ్గుతాయి అని అన్నారు. పశువులను శుభ్రమైన, సురక్షితమైన స్థలంలో ఉంచాలి. భోజనం, నీరు, సౌకర్యాలు పశువుల వయసు, రకం ప్రకారం సరిపడే విధంగా అందించాలి అని సూచించారు. పశువులపై క్రమంగా ఆరోగ్య పరీక్షలు చేయించి, చిన్న వ్యాధులను ముందే గుర్తించాలని అన్నారు. అనంతరం పశుగణాభివృద్ధి సంస్థ సూపర్వైజర్ యం డి జహంగీర్ మాట్లాడుతూ, కేవలం ఆడ దూడలు పుట్టే సెక్స్ సార్టెడ్ సెమెన్ అందుబాటులో ఉందని రైతు సోదరులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ల తెలిపిన సూచనలు పాటించాలి దీనివల్ల పశువుల సంరక్షణ మరియు నియమిత వైద్య పరీక్షలు రైతులకు మంచి పాలు, మాంసం మరియు ఆర్థిక లాభాలను అందిస్తాయి అని అన్నారు. ఈ శిబిరంలో స్థానిక గోపాలమిత్రులు బి.శివ, చినూరి వెంకటేశ్వర్లు, యస్ సతీష్, రవికుమార్ మరియు గ్రామ రైతు సోదరులు హాజరయ్యారు.

## అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తాం : లావణ్య

**బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి**





తొలిసమయం, కొత్తగూడెం, జనవరి 31:

ఒక్కసారి అవకాశం ఇవ్వండి...అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానంటున్నారు 27వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఎన్నమల్ల లావణ్య. కొత్తగూడెం కార్పొరేషన్ 27వ డివిజన్ నుండి బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీలో ఉన్న 25 సంవత్స రాల వయసున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థిని లావణ్య మాట్లాడుతు అడ్డగోలుగా హామీలు ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధినీ పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. పొరపాటు చేయడం సహజమని కానీ మోసం చేయడం క్షమించరాని నేరమని పదేళ్ల పాటు కెసిఆర్ తెలంగాణను అభివృద్ధి చేస్తే గ్లోబల్ ప్రచారాలు నమ్మి ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అవకాశమిచ్చి పొరపాటు చేశామని బాధపడుతున్నా రని దీన్ని అవకాశంగా తీసుకున్న రేవంత్ రెడ్డి మంత్రి వర్గం ఎప్పటికప్పుడు ప్రజలని మోసం చేస్తూనే ఉందని ఈసారి ఎలాంటి పొరపాటు చేయకుండా కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులకు పట్టం కట్టాలన్నారు. కెసిఆర్, కేటీఆర్ ఆశీస్సులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, స్థానిక ఎన్నికల ఇంచార్జి వద్దిరాజు రవిచంద్ర అండదండలు, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, నాయకులు వనమా రాఘవ తదితరుల సహాయ సహకారలతో 27 వ డివిజన్ నుండి పోటీ చేస్తున్న తనను గెలిపించాలని లావణ్య కోరారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న మోరే రమేష్ కుమార్



తొలిసమయం, కొత్తగూడెం, జనవరి 31 :

దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అదే విధంగా కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని 17వ డివిజన్ అభ్యర్థి మోరే రమేష్ అన్నారు. 11వ తేదిన జరగనున్న కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 17వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మోరే రమేష్ కుమార్ స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి జరగాలంటే హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలుపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు జరిగిన అన్యాయాన్ని ఎదిరించాలని, బీజేపీ ,బిఆర్ఎస్ మాయ మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.